మంచిమాట

మనసులో మాలిన్యం ఉన్నపుడు శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటే ఏం లాభం.. చేపలు రాత్రింబవళ్లు నీళ్లలోనే ఉన్నా వాటి వాసన పోదు కదా.



RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY


తెలుగు దిన పత్రిక...

ఆదివారం, 21 డిసెంబర్ 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 44

## టీఎంసీ సంరక్షణలో చొరబాటుదార్లు

# విరుచుకుపడిన మోదీ

**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారంనాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. కేంద్ర ప్రభుత్వం దేశ పౌరులతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. జీఎస్టీ బెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉపశమనం ఇచ్చిందని, దుర్గాపూజ, ఇతర పండుగల సమయంలో దేశవ్యాప్తంగా ప్రజల చాలా ప్రయోజనం పొందారన్నారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ నుంచి రక్షణ లభిస్తోందని ఆరోపించారు. గంగానది బీహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుందని, బీహార్ బెంగాల్‌కు మార్గం



చూపిందని పేర్కొన్నారు. బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలని పిలుపునిచ్చారు. తాను బెంగాల్ ప్రజలకు మనస్ఫూర్తిగా అంకితమయ్యానని, రాష్ట్రానికి నిధుల కొరత లేదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్న ఆయన.. బీజేపీని వ్యతిరేకించాలనుకుంటే టీఎంసీ వ్యతిరేకించవచ్చని, రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవడం అర్థరహితమన్నారు. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను' అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్ తహెర్‌పూర్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లిపోయారు. అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనపశ్చి మబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమా రు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

## సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి

## కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్



**హైదరాబాద్, డిసెంబర్ 20:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని మండిపడ్డారు. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్లు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్‌లోకి రావాలని కోరు తున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసేది ఏం ఉండదన్నారు. గ్రామంలోని ప్రతి అభివృద్ధికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు. బీజేపీలో గెలిచిన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల మీద అవగాహన ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట

# అభివృద్ధి అనేది ఉండదు

**హైదరాబాద్ :** తమకు ఉన్న హక్కులు, నిధులు, విధుల గురించి కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తెలుసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. రాజ్యాంగం ప్రకారం ఐదంచెల్లో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు సొంత ఆస్తులు, డబ్బులు కావని పేర్కొన్నారు. ఫైనాన్స్ కమిషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు ఇస్తారని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూపాయి వస్తే.. మరో రూపాయి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలకు పథకాలను ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. తాండూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ విమర్శించారు. మాకే నిధులు ఇవ్వడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే డైరెక్ట్‌గా చెప్పిండని గుర్తుచేశారు. నిధులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట అభివృద్ధి అనేది ఉండదని అన్నారు. కేసీఆర్ హయాంలో డంపింగ్ యార్డ్‌లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల 21 జాతీయ పంచాయతీ అవార్డులను తెలంగాణ సాధించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు గెలవడం సులభం.. కానీ పంచాయతీ ఎన్నికల్లో గెలవడమే కష్టమని కేటీఆర్ తెలిపారు. ఈ రెండేళ్లు మనకు కష్టంగా ఉంటుందని కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో అన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్



విమర్శించారు. షాపుల యూరియా ఇవ్వనోడు.. యాప్‌ల యూరియా ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. 2014 నాటికి తెలంగాణ అప్పు రూ.72 వేల కోట్లుగా ఉందని తెలిపారు. 2023 నాటికి తెలంగాణ అప్పు రూ.మూడున్నర లక్షల కోట్లు అయ్యిందని అన్నారు. అంటే.. బీఆర్ఎస్ హయాంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. అప్పు రూ.2.80 లక్షల కోట్లే అని తెలిపారు. అదే రేవంత్ రెడ్డి అప్పు తెచ్చి ఏంచేసిండో చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కేటీఆర్ తెలిపారు. తాండూరులో ఉండే 36 వార్డుల్లో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని అన్నారు.

## భయపెడుతోన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోం ది. గత రెండ్రోజులతో పోల్చితే ఇవాళ చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. తెలంగా ణలో చాలాచోట్ల సింగిల్ డిజిట్ టెంపరేచర్స్ నమోదయ్యాయి. సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్ర తలు నమోదవుతున్నాయి. పటాన్‌చెరులో 7, ఆదిలాబాద్‌లో 7.2, మెదక్‌లో 8, రాజేంద్రనగర్‌లో 8.5, హనుమకొండలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. అలాగే, హైదరాబాద్‌లో 10.8, నిజామాబాద్‌లో 11.6, హయత్‌నగర్‌లో 12, రామగుండంలో 12, దుండిగల్‌లో 12.2, ఖమ్మంలో 13.4 , నల్గొండలో 13.6, మహబూబ్‌నగర్‌లో 14.5, భద్రాచలంలో 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగమంచు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు వాహనదారులు. రాబోయే రెండ్రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు అలర్ట్ జారీచేసిన వాతావరణశాఖ.

## నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు

## హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 20:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నాంపల్లి ప్రజాప్రతినిధుల స్పెషల్ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ , తిరుమలగిరి, మట్టంపల్లి పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన కేసుల విచారణకు ఆయన హాజరు కావడం విశేషం. ఈ మూడు కేసులు ప్రధానంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు లేదా రాజకీయ కార్యక్రమాల సందర్భంలో నమోదయినవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఈ కేసులు నమోదయ్యాయి. కోర్టులో జడ్జి ముందు రేవంత్ రెడ్డి ఎగ్జామినేషన్ (ప్రశ్నోత్తరాలు) ప్రక్రియ పూర్తి చేశారు. మూడు కేసుల్లోనూ ఈ దశ పూర్తయిన నేపథ్యంలో తదుపరి విచారణ లేదా తీర్పు కోసం కోర్టు తేదీ నిర్ణయించనుంది. సీఎం హాజరుతో కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మీడియా, సామాన్యులను కోర్టు హాల్ సమీపంలోకి అనుమతించలేదు. కాంగ్రెస్ నేతలు ఈ కేసులను రాజకీయ కుట్రతో మోపినవని విమర్శిస్తున్నారు.

## స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని

## ముందుండి నడిపించేది వారే

**అనకాపల్లి, డిసెంబర్ 20:** జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా తాళ్ళపాలెంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం సమయంలో ప్రధాని తనకో బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల సీఎంలతో సమగ్ర చర్చ జరిపి నిర్వహణ అప్పగించారన్నారు. ఏ కార్యక్రమం అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయాలు సాధించగలమని చెప్పుకొచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముందుండి నడిపించేది గ్రీన్ సోల్జర్లని.. వారికి అభివాదాలు తెలియజేశారు సీఎం. రీసైకిల్ ఏకానమి సృష్టించామని.. అందరి ఆరోగ్యం కోసం ఈ పని చేస్తున్నట్లు తెలిపారు. సాలిడ్ వేస్ట్ నుంచి కంపోస్ట్ యూరియాగా మారుస్తున్నారని దీని వల్ల రైతులకు దిగుబడి పెరుగుతోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులే నిజమైన సైనికులని చెప్పుకొచ్చారు. 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 86 మెట్రిక్ టన్నుల చెత్త ఉంచి పోయిందని.. అక్టోబర్ 2 నాటికి ఆ చెత్త తొలగించామని తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే ప్రక్రియ 100 శాతం పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్స్‌కు రూ. 5 లక్షలు సాయం అందిస్తామన్నారు. వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌తో రోజు వెయ్యి టన్నుల చెత్త సేకరించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. అక్టోబర్ 2 తరవాత రాష్ట్రంలో సింగల్ యూస్ ప్లాస్టిక్ ఉండకూడదన్నారు. ఏ ఆఫీస్‌కు వెళ్లకుండా మొబైల్ ద్వారానే సేవలు పొందే అవకాశం తెస్తున్నామని చెప్పారు. నాది ఉడుంపట్టు.. వదిలి పెట్టేది లేదని తేల్చిచెప్పారు. స్వచ్ఛాంధ్రలో అనకాపల్లి 13 వ స్థానంలో ఉందన్న సీఎం.. ఇంకా మెరుగుపడాలని సూచించారు.



## తెలంగాణ ప్రజలు డబుల్ ఇంజిన్

## సర్కార్‌ను కోరుకుంటున్నారు

**హైదరాబాద్, డిసెంబర్ 20:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర హెూం శాఖ సహాయక మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన.. అవినీతి మయంగా, దరిద్రంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. తల నరికినా.. పైసా లేదని సీఎం రేవంత్ అంటున్నారని.. అందువల్లే ఇక్కడి ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లాగే డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారాయన. 'ఈసారి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. తెలంగాణలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేళ్ల నుంచి అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ కలిసి పోటీ చేయలేదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ బరిలో దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపుతానన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమైయ్యాయి? ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను జైలుకు పంపారా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో జైలుకు పంపారా? డ్రగ్స్ కేసులో జైలుకు పంపారా? ఫాం హౌస్ కేసులో జైలుకు పంపారా? కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులు కాబట్టే కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరినీ జైలుకు పంపలేదు' అని ఇరు పార్టీలపై ధ్వజమెత్తారు బండి సంజయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓడిన తర్వాత కేసీఆర్ ఎక్కడా కనబడలేదని.. అయితే ఫామ్ హౌజ్ లేదా యశోదా ఆసుపత్రిలో మాత్రమే కనిపిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఫామ్ హౌజ్ పాలను తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదన్న ఆయన.. పంచాయితీ ఎన్నికల్లో తమ పార్టీకి గతంలో 100 సీట్లు వస్తే.. ఇప్పుడు 600కు పైగా స్థానాలొచ్చాయన్నారు. లీకు వీరులు అన్ని పార్టీలోనూ ఉన్నారని ఈ సందర్భంగా కౌంటర్ వేశారు.



## బలహీనపర్చడం అంటే పేదల

## ప్రయోజనాలపై దాడి చేయడమే

- పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగింపు



**న్యూ ఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. గత 11 ఏళ్లుగా గ్రామీణ పేదల వెన్నుముకగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం () పట్ల కేంద్ర వివక్ష చూపిందన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆ పథకాన్ని బలహీనపర్చిందన్నారు. ఈ మేరకు సోనియా గాంధీ వీడియోను విడుదల చేశారు. ఎవరినీ సంప్రదించకుండానే ఈ పథకం స్వరూపాన్ని మార్చేశారని ఆరోపించారు. ఈ చర్య పేదల ప్రయోజనాలను విరుద్ధంగా ఉందన్నారు. ఈ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా, పథకం ఉనికినే ప్రశ్నార్థకం చేసిందని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం అంటే దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, కూలీలు, భూమిలేని నిరుపేదల ప్రయోజనాలపై దాడి చేయడమేనని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

# ఈ నెల 23 న ‘ మీ డబ్బు మీ హక్కు’ ప్రత్యేక శిబిరం

**- కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ డిసెంబర్ 20 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
ప్రజలు క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమయిన ఆస్తులను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘ మీ డబ్బు – మీ హక్కు ‘ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 న మెదక్ కలెక్టరేట్ లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, భీమా పాలసీలు తదితర ఆర్థిక ఆస్తులు యజమానులకు చేరేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సొమ్ము ప్రజలకే చేరాలన్న ఉద్దేశ్యంతో ఆర్బీఐ, ఐఆర్డిఎఐ, పిఎఫ్ఆర్డిఏ వంటి జాతీయ స్థాయి సంస్థలు, బ్యాంకులు, భీమా కంపెనీలు ఉమ్మడిగా ఈ శిబిరాల ను నిర్వహిస్తున్నాయన్నారుశిబిరంలో ఆస్తులు క్లెయిమ్ ల విధానం పై మార్గ నిర్దేశం చేస్తారన్నారు. బ్యాంకుల్లో పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్న పౌరులు ఉద్గం వెబ్ సైట్ ద్వారా సుల భంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మెదక్ జిల్లా న్యాయమూర్ధని మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**మెదక్ డిసెంబర్ 20 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలీమాని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రేపు 21-12-2025 నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఏర్పాట్లు, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వచ్చే కేసుల వివరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. న్యాయస్థానం పోలీస్ శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారుకోరారు.

# అంబేద్కర్ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో



**చేగుంట డిసెంబర్ 20 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం చేగుంట గ్రామానికినూతనంగా ఎన్నికైన సర్పంచ్ స్రవంతి సతీష్ లను ఉపసర్పంచ్ రఫిక్ ను సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సిరిబోజి సత్యనారాయణ ఎస్బిఐ, ఉపాధ్యక్షుడు కరుణ రాములు, ప్రధాన కార్యదర్శి సిర్గోజి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కర్నే లచ్చయ్య, కర్నే నర్సింలు, సలహాదారుడు సిరిగోజి స్టాలిన్ నరసింహులు, కర్ణ వెంకటి, కొండ ప్రసాద్, అశోక్, అజయ్, అంబేద్కర్ మాల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు,

# నిరుపేదలకు ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**3 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి చెక్కు పంపిణీ**



**పటాన్చెరు డిసెంబర్ 20 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ కి చెందిన గొల్లపల్లి శ్రీకాంత్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శ్రీకాంత్ వైద్యానికి మూడు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ కు ఎల్ఓసి పత్రాలను అందజేశారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

- **రోడ్డు భద్రత నియమాలు అందరూ పాటించాలి**
- **రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్**
- **జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**
- **హాజరైన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**






**మెదక్ డిసెంబర్ 20 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారుల, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖా అధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు లు హాజరయ్యారు.ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేవారని, గత ఏడాది నుంచి మాసోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు.రాష్ట్రంలో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాల్లో 18 నుంచి 20 మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. గత ఏడాది 7,949 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పై ఈ నెల ఆఖరులోగా జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహణ పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.నేషనల్ హై వే, ఆర్ అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా జిల్లాలోని బ్లాక్ స్పాట్లను గుర్తించాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రత మాసోత్సవాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని, నెల రోజులపాటు ట్రాఫిక్ వాలంటీర్లను నియమించాలని సూచించారు. అనంతరం వారిని అభినందిస్తూ సర్టిఫికెట్ అందించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం అందించాలని సుప్రీంకోర్ట్ ఆదేశాలు జారీ చేసిందని, రోడ్డు ప్రమాద బాధితుల వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన వారికి పారితోషికం ఇస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.కలెక్టర్ రాహుల్ రాజ్ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని రహదారి భద్రతపై అవగాహన సదస్సులు 9 సార్లు నిర్వహించామని,ఇంకా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు చేపడుతామని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చిస్తామని వివరించారు. నేషనల్ హై వే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహి ంచి, బ్లాక్ స్పాట్లు గుర్తిస్తామని, వాటి పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఏఎస్పీ మహేందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీరామ్,ఆర్ టి సి డిపో మేనేజర్ .ట్రాఫిక్ పోలీస్ లు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు








**మెదక్ డిసెంబర్ 20 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
పదవ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు అత్యవసరం అయితే తప్ప సెలవులు పెట్టొద్దు, ప్రధానోపాధ్యాయులు సెలవులు మంజూరు చేయొద్దు జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత గా ఉపాధ్యాయులు పనిచేయాలని, పదో తరగతి విద్యార్థులు బోధించే ఉపాధ్యాయులు సెలవులు పెట్టొద్దని, మండల విద్యాధికారులు అట్టి ఉపాధ్యాయులకు అత్యవసరమైతే తప్ప సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాధికారులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ,ఎంఈఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎఫ్ ఎల్ ఎన్, ఎల్ఐపి, ఏ ఎక్స్ ఎల్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులందరికీ సేలబస్ పూర్తి చేయాలని, ప్రతిరోజు క్లాసులకు హాజరయ్యేలా చూడాలని, హాజరు శాతం పెంచాలని, ఇకనుంచి ప్రతి రోజు 10వ తరగతి విద్యార్థుల హాజరు శాతాన్ని నేనే పరిశీలిస్తానని తెలియజేశారు. మొత్తం పదవ తరగతి లో ఉన్న విద్యార్థులని వారికి బోధించే ఉపాధ్యాయులు అడాప్ట్ చేసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్ను ఇన్చార్జిగా నియమించాలన్నారు. వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి యొక్క యాక్షన్ ప్లాన్ ను టీచర్ చేతిరాత ద్వారా తయారు చేయాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే తప్ప ఉపాధ్యాయులు సెలవులు పెట్టొద్దని, హెచ్ఎంలు ఎంఈఓ లు సెలవులు మంజూరు చేయొద్దని తెలిపారు. డ్రాప్ అవుట్ లేకుండా చూడాలన్నారు. పదవ తరగతి తర్వాత ఇంటర్ ఎక్కడ జాయిన్ అవుతారో..అని రిపోర్టు తయారు చేయాలన్నారు. పాఠశాలలోని వంట గదిలో ఎల్పిజి గ్యాస్ కోసం ప్రణాళికలు చేస్తున్నామన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా హ్యాండ్ వాష్ చేసుకునేలా చూడాలన్నారు. విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదేనని ,అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. పాఠశాలలో పోక్సో కమిటీలు ఏర్పాటు చేసి కిశోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి అన్నారు. కేజీబీలలో ఖాళీలు పూర్తి చేయాలని కేజీవీబీ, రెసిడెన్షియల్ పాఠశాలలో 100% రిజల్ట్ రాకపోతే చర్యలు తప్పవని వచ్చే విద్యా సంవత్సరానికి రెన్యువల్ ఉండదని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. కొన్ని కేజీవీబీలలో ఉపాధ్యాయులు వారి మీద వారే ఫిర్యాదులు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచకపోతే యాక్షన్ తీసుకొని, సామర్థ్యాలు పెంచిన ఉపాధ్యాయుల సత్కరిస్తామని వివరించారు. పీఎం శ్రీ,వివిధ పాఠశాలలో ఉపాధి హామీ ద్వారా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు.
పీఎం శ్రీ పాఠశాలలో 5 స్టార్ రేటింగ్ కలిగిన పాఠశాలలను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందించారు. గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలాలను ప్రశంసించారు. మాసాయిపేట, నిజాంపేట ,చేగుం%ఘు% 100% ఫలితాలు వచ్చాయని అభినందించారు. అనంతరం మెదక్ డీఈవో గా గతం లో పనిచేసి ఇటీవల బదిలీ అయ్యి డైట్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తున్న రాధా కిషన్ కు శాలువాతో సత్కరించి, గిఫ్ట్ అందించారు. తర్వాత మత్తు పదార్థాలు నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ ఆయా పాఠశాలలో విద్యార్థుల చేత చేయించాలని చెప్పారు.ఈ కార్యక్రమం లో డీఈవో విజయ, డైట్ కాలేజ్ ప్రిన్సి పల్ రాధాకిషన్ జిల్లా సైన్స్ అధిక రాజిరెడ్డి, ఏం ఓ సుదర్శనమూర్తి, ఎంఈఓ లు హెచ్ఎంలు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కేజీవిబీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్ డిసెంబర్ 20 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్పూర్ పరిధిలోని పటేల్ గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్పూర్ లలో 65 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, శంకుస్థాపన ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్న కంజర్ల నుండి అండూర్ వరకు 60 లక్షల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల మధ్య ఇంటర్ లింక్ రోడ్లు నిర్మిస్తూ.. మెరుగైన రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభా కు నాగునంగా ఏర్పడుతున్న కాలనీలలోనూ మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల అభివృద్ధికి సైతం ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, పంచాయతీరాజ్ డిఇ సురేష్ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచందర్, ఖదీర్, పిఆర్ డిఈ సురేష్, సత్యనారాయణ, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.





# కొత్త సిట్ విచారణ కీలకఅంశాలపై ఫోకస్

**హైదరాబాద్, డిసెంబరు20 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ మరింత వేగం పుంజుకుంది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు (శనివారం) నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు తీవ్రంగా విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో నిన్న (శుక్రవారం) హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈ సూచనల మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం



రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయి ంచారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు కోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెం ట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారం గా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తు న్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాష ణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కొత్త ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# సహచరుడి మృతి పాడె మోసిన పొంగులేటి కన్నీటి వదనంతో

రాజకీయాలు అంటే నిత్యం విమర్శలు చేసుకోవడం, ఆరోపణలు అని మాత్రమే అనుకుంటారు చాలా మంది. పార్టీలు, సిద్ధాంతాల పరంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే నేతలు.. వ్యక్తిగ తంగా మాత్రం అందరితో కలివిడిగా ఉంటూ సత్సంబంధాలు కొనసాగిస్తారు. రాజకీయాలకు అతీతంగా అందరితో స్నేహ సంబంధాలను నెరిపే నాయకులు ఎందరో ఉన్నారు. వ్యక్తిగ తంగా నిర్వహించుకునే కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేస్తుం టారు. అలాగే కష్టం వస్తే కదిలి వస్తారు. సహచరులు ఎవరైనా మరణిస్తే పదవి, హెూదాలను పక్కన పెట్టి మరీ వస్తారు. తాజా గా ఇదే సీన్ కనిపించింది. అనుచరుడి అంత్యక్రియల్లో పాడె మోశారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకుడు యడవల్లి రామిరెడ్డి చనిపోయారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆయన తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. ఆయన మృతితో నియోజకవర్గంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. యడవల్లి మృతి గురించి తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన నివాసానికి తరలి వచ్చారు.



పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ.. తన వెన్నంటి నడిచిన యడవల్లి మరణం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. అనుచరుడి అకాల మరణంతో కన్నీటి పర్యంతమైన పొంగులేటి.. తన హెూదాని పక్కన పెట్టి మరీ.. రామిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన పాడె మోశారు. ఈ దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది. యడవల్లి రామిరెడ్డి అంత్యక్రియలు శనివారం నాడు పాలేరులో నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి తన ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి మరీ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రామిరెడ్డికి కడసారి వీడ్కోలు పలుకుతూ మంత్రి పొంగులేటి స్వయంగా పాడె మోశారు. సాధారణ కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి శ్మశాన వాటిక వరకు నడిచి రామిరెడ్డిపై తనకు ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి హెూదాలో ఉండి కూడా, తన అనుచరుడి కోసం పొంగులేటి.. ఆ హెూదాను పక్కకు పెట్టి మరీ పాడె పట్టి.. కడసారి వీడ్కోలు పలకడాన్ని చూసి స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు. సీనియర్ నాయకుడు రామిరెడ్డి మృతితో పాలేరు గ్రామంలో తీవ్ర విషాదం నిండుకుంది. ఆయనను కడసారి చూసేందుకు.. భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పార్టీ ఎంతో నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయింది అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిది అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# వారంతా ఒకవైపు బీఆర్ఎస్ మరోవైపు

**హాలియా, డిసెంబర్ 20 :** కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల అధికారులు ఒకవైపు.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరోవైపు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులు లేకుండా బైట తిరిగే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల కంటే పోలీసులు, ఎస్ఐలు ఎక్కువ పనిచేస్తున్నట్లు విమర్శించారు. శనివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియాలోని లక్ష్మీ గార్డెన్‌లో బీఆర్ఎస్ బలపర చగా ఎన్నికైన 60 మంది నూతన సర్పంచులకు ఆత్మీయ సన్మాన ం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ కారు గుర్తు వస్తదని.. అది అందరిని తొక్కుకుంటూ పోతదన్నారు. ఈ రెండేళ్లలో నియో జకవర్గానికి ఏమీ పని చేశారో జానారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్లా నాడే రాజకీయాలు తర్వాత గ్రామాలు అన్ని తమవే అని భావించి ఆ విధంగానే పరిపా



లించినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రలోభాలకు పాల్పడుతున్నట్లు దుయ్యబట్టారు. ఇచ్చిన ఇండ్లు కట్టాలి అంటే ఉన్నది అమ్మాలి అనే పరిస్థితి తలెత్తిందన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పెద్ద పెద్ద నాయకులు రెండేళ్ల తర్వాత మీ వెంటే మేము అంటూ బీఆర్ఎస్‌లోకి వస్తారన్నారు. నల్లగొండ జిల్లాలో ఎలక్షన్ అంటే రాజకీయ ఘర్షణలు ఉండేవి. కానీ కేసీఆర్ వచ్చినాక, 60 ఏండ్లు వారు చేయని అభివృద్ధి పదేండ్లలో అభివృద్ధి చేసి చూపించినట్లు తెలిపారు. పేద ప్రజల కోసం కేసీఆర్ ఏమీ చేసిండో అన్ని బంద్ చేసి కమీషన్ పథకాలు మాత్రమే తీసుకొస్తున్నట్లు తెలిపారు. కారు 100 కిలోమీటర్ల వేగంతో వస్తుందని.. చెయ్యి ఖతం అవుతాదని, దుర్మార్గ ప్రభుత్వంనికిదే పునాది అని తెలిపారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు హాలియా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ తీశారు.

# అబద్ధాలు ఆడడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్ రెడ్డికే ఇవ్వాలి

**సంగారెడ్డి :** పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ స్థానాలను కాంగ్రెస్ తన ఖాతాల్లోకి వేసుకుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రాజకీయాల్లో అబద్ధాలు ఆడడంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్‌రెడ్డికే ఇవ్వాలని విమర్శించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పుడైనా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీ 90 శాతం గెలిస్తే పది పైసలు ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయి. కానీ బీఆర్ఎస్ 40 శాతం అంటే 4వేలకు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచింది. సంగారెడ్డిలో 34 సర్పంచులు గెలిస్తే అందులో 27 గెలిచామని రేవంత్ రెడ్డి చెప్తున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 శాతంలోపే సర్పంచులు గెలిస్తే 66 శాతం గెలిచామని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖానికి ఎరువులు ఇచ్చే తెలివి లేదని అన్నారు. పంట పండాలంటే నీళ్లు కావాలి. కరెంటు కావాలి. ఎరువులు కావాలి. రేవంత్ రెడ్డి ఏమంటున్నాడు అప్పులు కావాలి. మ్యాపులు



కావాలి అంటున్నాడు. ఎరువు బస్తాలు కావాలంటే యాప్‌లో కొట్టండి అంటున్నాడు. ఎప్పుడైనా నీ మొఖానికి వ్యవసాయం చేసావా? రైతుల కష్టం మీకు తెలుసా? నని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కరెంటు ఫుల్. నీళ్లు ఫుల్. ఎరువులు ఫుల్. రేవంత్ రెడ్డి వచ్చినంక రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిండు, కరెంటు 14 గంటలు కూడా వస్తలేదు, ఎరువుల కోసం లైన్ లో నిలబడి గోసపడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ 10, 12 స్థానాలకు మించి గెలవదని తెలిపారు. ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ కావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ధైర్యముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు జరపాలి .మున్సిపాలిటీల పదవి కాలం పూర్తయి సంవత్సరమవుతున్నా ఎన్నికలు పెట్టట్లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎందుకు పెట్టట్లేదని ప్రశ్నించారు. కోపరేటివ్ ఎలక్షన్ పెట్టమంటే కూడా కాంగ్రెస్ నాయకులను నామినేట్ చేసుకుందామని జీవో ఇచ్చారని హరీష్ రావు వెల్లడించారు. ధైర్యముంటే, రైతులకు మేలు చేసే నాయకుడివి అయితే నామినేటేడ్ కాకుండా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం డబ్బులు 85 శాతం ఢిల్లీ నుంచి గల్లికే వస్తాయని ఎవరూ కూడా దానిని ఆపలేరని తెలిపారు. ఏ ప్రజాప్రతినిధికి లేని చెక్ పవర్ సర్పంచ్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. గెలిచిన సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి సర్పంచ్ విధివిధానాలు, బాధ్యతలపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తామన్నారు.

# మెడికల్ కాలేజీల పనితీరుపై నివేదిక ఇవ్వాల్సిందే

**హైదరాబాద్, డిసెంబర్ 20:** రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించ నున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థు లకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక



ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

# సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును కలిసిన అమీన్పూర్ బి ఆర్ ఎస్ నాయకులు కాటా సునీత రాజు గౌడ్.

**అమీన్పూర్ డిసెంబర్ 20 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** బీఆర్ఎస్ పార్టీ మాజి మంత్రి, సిద్ది పేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీశ్‌రావు ని కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ కాట సునిత రాజేష్ గౌడ్ .అమీన్‌పూర్‌కు సంబంధించిన కొన్ని ముఖ్యమైన సమస్యలను హరీశ్ అన్న దృష్టికి తీసు కెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని సునీత అన్నారు.



# విద్యార్థులకు ప్లేట్ల బహుకరణ





**పాపన్నపేట,డిసెంబర్,20, మెదక్ టుడే న్యూస్:** మండల కేంద్రమైన పాపన్నపేట కు చెందిన అడ్వకేట్ స్వర్గీయ చింతల వెంకటేశం జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ప్లేట్లను బహుకరించారు, ఆయన సతీమణి విజయలక్ష్మి దాతగా వ్యవహరించి 400 ప్లేట్లను అందించారు, వీటిని స్థానిక నాయకుడు నరేందర్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో దాత రజిని కుటుంబ సభ్యులు రజిత రాజశేఖర్, సాయి కృష్ణ, మౌనిక, లక్ష్మీనారాయణ, శ్రీధర్, కిరణ్ అడ్వకేట్లు రాజేష్, రజిని, పాపన్నపేట ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, మాజీ ఉప సర్పంచ్ కలీం, దోసని సంగమేష్, నాయికోటి శీను, బెజగం విట్టల్, చినురి రాములు, ఆకుల నారాయణ, హెడ్మాస్టర్ మహేశ్వర్ ఉపాధ్యాయులు వెంకటేశం అంజాగౌడ్ భట్టు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేట పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జిగా సంగమేశ్వర్




**పాపన్నపేట,డిసెంబర్,20, మెదక్ టుడే న్యూస్:** పాపన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్చార్జిగా సంగమేశ్వర్ ను నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు, ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఎఫ్ఎసిఎస్ కొత్తపల్లి , పిఎసిఎస్ చీకోడ్ పర్సన్ ఇన్చార్జిగా అసిస్టెంట్ రిజిస్టర్ శంకర్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# చేగుంట మండలం సర్పంచ్ ఫోరం అధ్యక్షురాలుగా సంద్రుగు స్రవంతి సతీష్



**చేగుంట డిసెంబర్ 20మెదక్ టుడే న్యూస్**

చేగుంట స్థానిక సంస్థ ఎన్నికలో విజయం సాధించిన నూతన సర్పంచ్ లు చేగుంట సర్పంచ్ ఫోరం అధ్యక్షురాలుగా సంద్రుగు స్రవంతి-సతీష్ ఉపాధ్యక్షులుగా గుర్జకుంట సుకన్య-నాగులు ప్రధాన కార్యదర్శిగా కొండీ రాజ్య లక్ష్మి స్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ నూతన సర్పంచ్ లు పాల్గొన్నారు

# రాష్ట్రంలో.. 97,37,832 ఓటర్ల తొలగింపు



**చెన్నై:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా నుండి 97,37,832 మందిని తొలగించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఉత్తర్వుల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.సర్ పనులు ప్రారంభించక ముందు 6,41,14,587 మంది ఓటర్లుండేవారని, ముసాయిదా ఓటరు జాబిదాలో 5,43,76,755 మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 97,37,832 మంది ఓటర్లను తొలగించామని, సర్ ఫారాలు తిరిగి సమర్పించని వారు, కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చన్నారు. ఇందు కోసం బూత్ కమిటీల ద్వారా రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో కొత్తగా చేరదలుచుకున్నవారు శుక్రవారం నుండి జనవరి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.రాష్ట్రంలో.రాష్ట్రంలో మొత్తం 6కోట్ల41లక్షల 14వేల 587 మంది ఓటర్లలో, 6కోట్ల41లక్షల, 13వేల 773 మందికి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. వాటిలో 6కోట్ల41లక్షల 13వేల 221 ఫారాలు పూర్తిచేసి ఈసీకి సమర్పించారు. ఈ వివరాలతో రూపొందించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కార్పొరేషన్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసి వీక్షించవచ్చు. మసాయిదా ఓటరు జాబితాలో చిరునామా మారిన వారు ఫారం 8, కొత్తగా చేరదలిచిన వారు ఫారం 6ను పూర్తిచేసి ఈసీ కోరిన ఆధారాలతో సమర్పించి జనవరి 18వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలి, ఇక తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 17న విడుదలవుతుంది.కాగా.. తెన్‌కాశి జిల్లాలో 1.51లక్షల మంది, వేలూరు జిల్లాలో 2.15లక్షల మంది, కళ్లకురుచ్చి జిల్లా 2.15లక్షల మంది, తంజావూరు జిల్లా 2.06లక్షల మంది, తిరునల్వేలి జిల్లాలో 2.14లక్షల మంది, మైలాడుదురై జిల్లాలో 75.378 మందిని ఓటరు జాబితా నుండి తొలగించారు. అదే విధంగా రాణిపేట 1.40లక్షల మంది, దిండుగల్‌లో 3.20లక్షల మంది, కరూర్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో 79,690 మంది, అరియలూరు జిల్లాలో 24,368 మంది ఓటర్లను తొలగించడం గమనార్హం.గ్రేటర్ చెన్నైలో.గ్రేటర్ చెన్నైలో 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చని ఈసీ హామీ ఇచ్చింది. నగరంలో ఎస్ఐఆర్ ప్రారంభించక ముందు 40,03694 మంది ఓటర్లుండగా, ముసాయిదా ఓటరు జాబితాలో 25,79,676 మంది మాత్రమే ఉండటం గమనార్హం. పాత ఓటరు జాబితాల నుండి 14,20,018 మందిని తొలగించారు. వీరిలో 1.56లక్షల మంది మరణించినవారు కాగా, ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో లేనివారు 27,328 మంది,అలాగే వలస వెళ్లిన వారు 12,22,164 మంది, రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగివున్న వారు 18,772 మంది అని ఈసీ తెలిపింది. నగరానికి చెందిన ముసాయిదా ఓటరను జాబితాలో 13,31,243 మంది మహిళలున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో 1.03లక్షల మంది ఓటర్లను తొలగించారు. ప్రస్తుతం 1.86లక్షల మంది ఓటు హక్కు కలిగివున్నారు. అలాగే డిప్యూటీ సీఎం ఉదయనిధి నియోజకవర్గం చేపాక్కం–ట్రిప్లికేన్‌లో 89వేల మందిని ఓటరు జాబితా నుండి తొలగించగా, 1.50లక్షల మంది ఓటర్లున్నారు.

# పెను విషాదం రైలు ప్రమాదంలో 8 ఏనుగులు మృతి




**అస్సాం :** అస్సాంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఏనుగుల గుంపును రైలు ఢీకొట్టిన ఘటనలో 8 ఏనుగులు ప్రాణాలు కోల్పోగా.. ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. (శనివారం) ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శనివారం తెల్లవారుజామున 2.17 గంటల సమయంలో అస్సాంలోని హెజాయ్ ప్రాంతంలో ఏనుగుల గుంపు రైలు పట్టాలు దాటుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయిరంగ్ – న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు ఆ పట్టాలపై వేగంగా దూసుకువచ్చింది. పట్టాలు దాటుతున్న ఏనుగుల్ని ఢీకొంది. దీంతో 8 ఏనుగులు అక్కడికక్కడే చనిపోయాయి.ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. గువహటికి 126 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏనుగులు ఢీకొట్టిన వేగానికి లోకో మోటివ్‌తో పాటు ఐదు కోచులు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏమీ కాలేదు. ఇక, సమాచారం అందుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. రైలు పట్టాలు తప్పటంతో పాటు ఏనుగుల కళేబరాలు చెల్లా చెదురుగా పడిపోవటంతో ఎగువ అస్సాంతో పాటు పలు ఈశాన్య ప్రాంతాలకు సంబంధించిన రైలు సేవలు నిలిచిపోయాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాకపోవటంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. పట్టాలపై ఏనుగుల్ని చూసిన లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేక్స్ వేశాడు. అయినా కూడా దారుణం జరిగిపోయింది. రైలు ఏనుగుల్ని ఢీకొట్టింది.

# సంప్రదాయ వైద్యంతో అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారం



**దిల్లీ:** సంప్రదాయ వైద్యం ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడగలదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అదనోమ్ తెలిపారు. సైన్స్, సంప్రదాయ వైద్యం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటిందని వెల్లడించారు. దిల్లీలో సంప్రదాయ వైద్యంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో టెడ్రోస్ అథనామ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత్ పై ప్రశంసలు కురిపించారు. ఈ సమ్మిట్?లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సహా 100 దేశాలకు చెందిన మంత్రులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో సాంప్రదాయ వైద్యాన్ని సమర్థించినందుకు ప్రధాని నరేంద్ర మోదీని టెడ్రోస్ అధనోమ్ ప్రశంసించారు. సమకాలీన ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో సాంప్రదాయ వైద్యం తాలుక ఔచిత్యాన్ని హైలైట్ చేశారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 సమావేశంలో ప్రధాని మోదీ సంప్రదాయ వైద్యం గురించి అంతర్జాతీయ స్థాయిలో తెలియజేశారని అన్నారు. ఆ పిలుపే ఇప్పుడు సంప్రదాయ వైద్యానికి అపూర్వమైన అంతర్జాతీయ ప్రతిస్పందనను సృష్టించిందని పేర్కొన్నారు. 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం' అనే ప్రధాని మోదీ దార్శనికత సాంప్రదాయ వైద్యం ప్రధాన సూత్రాలతో ఏకీభవిస్తుందని తెలిపారు. 'సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య సమస్యలు పరిష్కారం' "సంప్రదాయ వైద్యం నేటి ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడుతుంది. అలాగే ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుంది. సంప్రదాయ వైద్యం, ఆవిష్కరణలు కలిసి ముందుకు సాగగలవని భారత్ చూపించింది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, సంప్రదాయ విజ్ఞానం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం ఈ దార్శని కతను ప్రపంచం ముందుకు తీసుకురావడంలో సహాయపడింది. దిల్లీ డిక్లరేషన్ ను ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాను. సాంప్ర దాయ వైద్యం గతానికి సంబంధించినది కాదు. ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు కేంద్రంగా మారుతున్న ఒక సజీవ, అభివృద్ధి చెందుతున్న శాస్త్రం అని భారత్ స్పష్టంగా నిరూపిం చింది. సాంస్కృతిక వారసత్వం, మేధో సంపత్తిని గౌరవిస్తూ జీవవైవిధ్యం, సాంప్రదాయ వైద్యాన్ని కాపాడటానికి మేము కృషి చేస్తాం" అని టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. భారత్, డబ్ల్యూహెచ్ఓ మధ్య పెరుగుతున్న బంధానికి ప్రతీకగా దిల్లీలో కొత్తగా నిర్మించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయ కాంప్లెక్స్ ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. గుజరాత్ లోని జామ్ నగర్ లో డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ స్థాపించారు. ఈ విషయంపైనా టెడ్రోస్ అధనోమ్ స్పందించారు. ఈ ప్రయత్నాలు సాంప్రదాయ వైద్యాన్ని ఆరోగ్య వ్యవస్థలు, పరిశోధనలతో అనుసంధానించడానికి సహాయపడ్డాయని పేర్కొన్నారు.అలాగే 'డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సమ్మిట్ ఆన్?ట్రెడిషనల్ మెడిసిన్' శిఖరాగ్ర సమావేశానికి హాజరైన టెడ్రోస్ అధనోమ్?తో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ క్రమంలో సాంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి టెడ్రోస్ అధనోమ్?కు మోదీ తెలియజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. "డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయేసస్ తో ఫలప్రదమైన చర్చ జరిగింది. సంపూర్ణ ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడంలో సంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి మేము చర్చించాం" అని మోదీ ఎక్స్ పోస్ట్?లో పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మోదీ సంప్రదాయ వైద్యం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. సంప్రదాయ వైద్యానికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విజ్ఞానశాస్త్రం ద్వారా విశ్వాసాన్ని పెంపొందించి, సంప్రదాయ వైద్యం పరిధిని విస్తరించాలని వెల్లడించారు. పరిశోధనల బలోపేతంతో పాటు డిజిటల్ టెక్నాలజీ వినియోగం వల్ల సంప్రదాయ వైద్యానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని స్పష్టం చేశారు. ఆయుర్వేదంలో సమ స్థితిని ఆరోగ్యానికి పర్యాయపదంగా పరిగణిస్తారని అన్నారు.

# గవర్నర్ రవి సంచలన కామెంట్స్



**చెన్నై:** రాష్ట్రం ఆత్మహత్యలకు రాజధానిగా మారుతోందని, జాతీయ నేరగణాం కాలను బట్టి ప్రతియేటా ఈ రాష్ట్రంలో 20 వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గవర్నర్ ఆర్ఎన్ రవి( ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో జాతి,, మత విద్వేషాల కారణంగా పలు యుద్ధాలు జరుగుతున్నాయని, మానవులు మానసిక ఒత్తిడుల కారణంగా, వేర్పాటువాదంవల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నా రు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో శుక్రవారం ఉదయం 'సింధూ సరస్వతి నాగరికత మహానాడు' ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు 65 మంది చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్యలను నిరోధించడానికి మానవుల జీవితాలను మెరుగుపరచడంతోపాటు దేశ సంస్కృతీ సంప్రదయాలు, ఆచరిస్తున్న సిద్ధాంతాలు గురించి ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యులు, ద్రావిడులని ప్రజల్లో విబేధాలను సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిప్రయత్నాలు ఎన్నటికీ సఫలం కావని, కారణం వారి వద్ద అసత్యాలతో ఆచరణకు సాధ్యం కాని సిద్ధాంతాలే ఉన్నాయని గవర్నర్ చెప్పారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అతని భార్య బుష్రా బీబీ(కు ఊహించని షాక్ తగిలింది. తొషఖానా – 2 అవినీతి కేసులో ఫెడరల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఉన్న రావల్పిండిలోని అడియాలా జైలోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పులు వెలువరించడం గమనార్హం. 2021 మే నెలలో సౌదీలో ఇమ్రాన్ పర్యటించారు. 2021 మే నెలలో సౌదీ అరేబియా పర్యటించిన సందర్భంగా యువరాజు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఖరీదైన 'బల్గరి' నగల సెట్ ను బహుమతి()గా అందజేశారు.ప్రభుత్వ ఖాజానాకు (తోషఖానా)కు అప్పగించకుండా ఇమ్రాన్ అతని భార్య బుష్రా సొంత ప్రయోజనం కోసం తక్కువ ధరకు విక్రయించినట్లు వచ్చిన ఆరోపణపై కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జు మంద్ ఈ సంచలన తీర్పు ప్రకటించారు. ప్రధాని హూదాలో ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడి నందుకు పాకిస్థాన్ పీనల్ కోడ్ సెక్షన్ 409 కింద 10 ఏళ్లు కఠిన శిక్ష, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద 7 ఏళ్లు సాధారణ శిక్ష విధించారు. అంతేకాదు దంపతులకు చెరో రూ.16.4 మిలియన్ జరిమానా కూడా విధించారు. ఈ తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ మరో పదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పోయింది.ఈ తీర్పును హై కోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్ ఖాన్ తరుపు న్యాయవాది తెలిపారు.

# హిందూ వ్యక్తి హత్యపై బంగ్లాదేశ్ సీరియస్



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు రెచ్చిపోతున్నాయి. మతపరమైన ఆరోపణల సాకుతో సామాన్యులపై జరుగుతున్న దాడులు ఆ దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా దిగజార్చుతున్నాయి. ఇటీవల 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ యువకుడిని "ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న" నెపంతో నిరసనకారులు క్రూరంగా కొట్టి చంపిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ అమానుష కాండపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమ వ్వడంతో.. ఎట్టకేలకు యూనస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.ఏడుగురి అరెస్ట్.. ప్రభుత్వం సీరియస్ దీపూ చంద్రదాస్ హత్య కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అధికారికంగా ప్రకటించారు. "మా పాలనలో మూక దాడులకు తావులేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారికి కఠిన శిక్షలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. అల్లర్లపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలందరూ సంయమనం పాటించాలని కోరారు. అయితే క్షేత్రస్థాయిలో హిందువులపై జరుగుతున్న దాడులు ఇంకా ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి.భారతీయులకు హైకమిషన్ అప్రమత్తతబంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఇంకా అదుపులోకి రాకపోవడంతో అక్కడి భారత హైకమిషన్ కీలక సూచనలు చేసింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో రాజధాని ఢాకాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. శనివారం ఆయన అంత్యక్రియల సందర్భంగా భారీ ఎత్తున నిరసనకారులు గుమిగూడారు.ఇదీ చూడండి: బంగ్లాదేశ్‌లో హిందూ నేత కిడ్నాప్, దారుణ హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్

# డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లవచ్చు



**లక్నో:** దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదు అని మంత్రి నడ్డా పేర్కొన్నారు. లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ భారత్‌లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలను, సదుపాయాల్ని వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.

# మేమిద్దరం వెళ్తాం ఢిల్లీ పర్యటనపై డీకే



**బెంగళూరు:** అధికార మార్పిడి అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అంతరం పెరుగుతోందంటూ ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చర్చల కోసం ఎప్పుడు పిలిచేది కాంగ్రెస్ అధిష్ఠానం తమ ఇద్దరికీ చెప్పిందని అన్నారు. అధిష్ఠానం ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు.పార్టీ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఇద్దరు నేతలు వెళ్లే అవకాశం ఉందా అని అడిగినప్పుడు డీకే నవ్వుతూ సమాధానమిచ్చారు. మీడియాకు తప్పనిసరిగా చెబుతానని, ఏదీ దాచిపెట్టనని అన్నారు. సరైన సమయంలో ఢిల్లీకి పిలుస్తామని అధిష్ఠానం పెద్దలు తమ ఇద్దరికి ఫోన్ చేసి చెప్పారని, పిలుపు ఎప్పుడు వస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పదవిలో తాను కొనసాగుతానని అసెంబ్లీలో సిద్ధరామయ్య తాజాగా ప్రకటించిన నేపథ్యంలో డీకే ఈ వ్యాఖ్యలు చేశారు.ఉత్తర కర్ణాటక అభివృద్ధి పనుల అంశంపై సిద్ధరామయ్య శుక్రవారంనాడు అసెంబ్లీలో మాట్లాడుతూ, తన పదవీకాలం రెండున్నరేళ్లకే పరిమితమని తాను ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అధిష్ఠానం తనను ఐదేళ్లూ పదవిలో కొనసాగిస్తుందని అనుకుంటున్నట్టు చెప్పారు. 'మీ హయాంలో నార్త్ కర్ణాటకకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా?' అని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు అడిగిన ప్రశ్నకు స్పందనగా సీఎం ఈ సమాధానం ఇచ్చారు.సీఎం పదవిపై సిద్ధరామయ్య క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో డీకే శివకుమార్ పుణ్యక్షేత్రాలను సందర్శించడం అందరి దృష్టిని ఆకర్షించింది. అమావాస్య వేళ అమ్మవారి ఆలయాలను డీకే శివకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం పదవిపై సిద్ధరామయ్య వ్యాఖ్యలపై స్పందించారు డీకే శివకుమార్. తనకు , సిద్ధరామయ్యకు మధ్య ఎలాంటి అభిప్రాయభేదాలు లేవన్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ వ్యవహారాలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. సిద్ధరామయ్య , డీకే శివకుమార్ ఆధిపత్య పోరుతో కర్ణాటకలో అభివృద్ధి కుంటుపడిందన్నారు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి. కర్నాటక వ్యవహారాలపై కాంగ్రెస్ హైకమాండ్ పట్టు కోల్పోయింది అన్నారు. అందుకే సిద్దరామయ్య రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని అన్నారు. "కాంగ్రెస్ దగ్గర ఇప్పుడు కమాండ్ లేదు. కమాండ్ లేనప్పుడు నిర్ణయం రాదు. తానే సీఎం అవుతానని డీకే శివకుమార్ చెబుతారు.. నవంబర్ , డిసెంబర్ లోనే పగ్గాలు చేపట్టాలి.. కాని కాస్త ఆలస్యమయ్యిందని చెబుతారు. ఇద్దరు కలిసి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ చేస్తారు.. ఎలాంటి అభిప్రాయభేదాలు లేవని అంటారు. హైకమాండ్ దగ్గర చెప్పడానికి ఏమి లేదు" అని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. అధిష్ఠానం తన వైపే ఉందని అనుకుంటున్నానని, అయితే పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు.కాగా, పలువురు నాగసాధువులు శనివారంనాడు డీకే నివాసానికి వచ్చి ఆశీస్సులు ఇచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా కూడా ఉన్న డీకే మంగళవారంనాడు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకునేందుకు ఢిల్లీ వెళ్తున్నారు. నదుల అనుసంధానం విషయంలో కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ తమను పిలిచినట్టు డీకే తెలిపారు. మహదయి, కృష్ణ వాటర్ అవార్డ్, మేకేదాటు, ఎగువ భద్ర ప్రాజెక్టులకు సంబంధించి చర్చించనున్నట్టు చెప్పారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..